
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శుక్రవారం 13 సెప్టెంబరు 2024



8

వేకువజామున.. రెండు కిలోమీటర్లు నడిచి..

గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థినుల రాస్తారోకో



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థినులు



సిరిసిల్ల మానేరు వాగు



నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్ట్

సాగుకు భరోసా

- జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షాలు
- జిల్లాలో 850.4 మిల్లీమీటర్ల వర్షపాతం
- ప్రాజెక్టులు, చెరువుల జలకళ
- వానాకాలం పంటకు ఊపిరి
- జిల్లాలో 2.32 లక్షల ఎకరాల్లో సాగు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మెట్ట ప్రాంతంగా వర్షాలపైనే ఆధారపడ్డ రాజన్న సిరిసిల్ల జిల్లా అన్నదాతలు యాసంగి దాకా సాగు నీటికి ఢోకాలేదనే భరోసాతో ఉన్నారు. వానాకాలం ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో రిజర్వాయర్‌లు, చెరువులు నోరెళ్లబెట్టి అన్నదాతలను అయోమయానికి గురిచేశాయి. కానీ ఇటీవల భూగర్భ దాహం తీరే విధంగా భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు జిల్లాలోని ప్రాజెక్ట్‌లు, చెరువులు, కుంటలకు జలకళ తెచ్చింది. సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ఏర్పడ్డ లోపాలతో గోదావరి నది నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం లేక పోవడంతో ఇబ్బందులు పడ్డ పరిస్థితుల నుంచి ఎల్లం పల్లి నుంచి రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపోయడంతో పాటు ఎగువ మానేరు ప్రాజెక్ట్‌కు కూడెల్లి, పాల్వంచ వాగులతో మత్తడి దూకి మానేరు వాగు, నిమ్మపల్లి ప్రాజెక్ట్ నుంచి మూల వాగు నుంచి వరద పోలెత్తి రావడంతో మిడ్ మానేరు, అనంతారం ప్రాజెక్ట్‌లు నిండాయి. ఈ ప్రాజెక్ట్‌లకు అనుసంధానంగా ఉన్న ఎల్ఎండీ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌లోకి నీటిని తరలించారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో 27.5 టీఎంసీల సామర్థ్యానికిగాను 24.31 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎస్సారెస్పీ ద్వారా 15 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది, మిడ్ మానేరు నుంచి 6,550 క్యూసెక్కులు దిగువకు వదు లుతున్నారు. అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో 3.50 టీఎంసీల సామర్థ్యానికి గాను 2.65 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి 6,400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లో రెండు టీఎంసీలకుగాను పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. జిల్లాలోని 633 చెరువులు పూర్తిగా నిండి పోయాయి. 213 చెరువులు మత్తడి దూకాయి.

జిల్లాలో 850.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షాలతో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదైంది. ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 626.3 మిల్లీ మీటర్లకు గాను 850.4 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో రుద్రంగి 821.5 మిల్లీ మీటర్లు, చందుర్తి 1118.2 మిల్లీమీటర్లు, వేములవాడ రూరల్‌లో 762.6 మిల్లీ మీటర్లు, బోయినపల్లి 816.9 మిల్లీమీటర్లు, వేముల వాడ 901.3 మిల్లీమీటర్లు, సిరిసిల్ల 851.3 మిల్లీ మీటర్లు, కోనరావుపేట 804.6 మిల్లీమీటర్లు, వీర్నపల్లి 884.6 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డి పేటలో 833.6 మిల్లీమీటర్లు, గంభీరావుపేట 728.5 మిల్లీమీటర్లు, ముస్తాబాద్ 849.3 మిల్లీమీటర్లు, తంగళ్లపల్లి 900.1 మిల్లీమీటర్లు, ఇల్లంతకుంట 782.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీగా కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు పెరిగి తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

యాసంగి దాకా ఢోకా లేదు...

జిల్లాలో వానాకాలం సీజన్ ముగిసి పోతోంది. ఖరీఫ్ సీజన్‌తో పాటు యాసంగి పంటల వరకు సాగునీటికి ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రస్తుతం 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ప్రధానంగా వరి 1.83 లక్షలకుగాను 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. పత్తి 49,332 ఎకరాలు, పెసర 56.26 ఎకరా లు, కందులు 939 ఎకరాలు, ఇతర పంటలు 122 ఎకరాల్లో సాగు చేశారు.గత యాసంగిలో జిల్లా లో 1.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేసుకు న్నారు. వరి 1.74 లక్షలు మొక్కజొన్న 1,332 ఎకరాలు, నువ్వు లు 307 ఎకరాలు, పొద్దు తిరుగుడు 307 ఎకరాలు, శెనగ 209 ఎకరాలు, ఇతర పంటలు 391 ఎకరాల్లో వేసుకున్నారు. వచ్చే యాసంగిలోనూ భూ గర్భ జలాలు పెరగడం, నీటి సౌకర్యం ఉండడంతో పంటలు పెరుగుతాయని భావిస్తున్నారు.

జిల్లాలో వానాకాలం సాగైన పంటలు (ఎకరాల్లో)

మండలం	వరి	పత్తి
గంభీరావుపేట	18,800	220
ఇల్లంతకుంట	24,000	12,412
ముస్తాబాద్	22,000	760
సిరిసిల్ల	4,550	780
తంగళ్లపల్లి	19,010	1,300
వీర్నపల్లి	6,800	514
ఎల్లారెడ్డిపేట	16,950	3,900
బోయినపల్లి	13,000	6,795
చందుర్తి	15,500	5,800
కోనరావుపేట	17,850	4,601
రుద్రంగి	5,500	3,200
వేములవాడ	5,200	5,100
వేములవాడరూరల్	11,150	3,950
మొత్తం	1,80,310	49,332

జిల్లాలో వానాకాలం సాగు పరిస్థితి (ఎకరాల్లో)

మండలం	సాగు అంచనా	అయిన సాగు
గంభీరావుపేట	19,535	19,036.93
ఇల్లంతకుంట	39,987	37,209.54
ముస్తాబాద్	24,239	23,060.51
సిరిసిల్ల	5,417	5,352.58
తంగళ్లపల్లి	22,270	20,405.33
వీర్నపల్లి	8,095	7,314.13
ఎల్లారెడ్డిపేట	23,093	20,881.72
బోయినపల్లి	21,150	20,044.84
చందుర్తి	22,016	21,346.11
కోనరావుపేట	24,295	22,535.47
రుద్రంగి	10,857	9,342.07
వేములవాడ	7,820	10,366.61
వేములవాడ రూరల్	14,340	15,150.60
మొత్తం	2,42,766	2,32,046.44

నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇవ్వాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 12: నియమ, నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గురువారం పరిశ్రమల శాఖతోపాటు సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో కలిసి పరిశ్రమల అనుమతులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. అనుమతుల కోసం ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఏఏ కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం జనవరి నుంచి వివిధ రకాల 45 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని కలెక్టర్ దృష్టికి పరిశ్రమల శాఖ జీఎం గణేష్‌రాం తీసుకవచ్చారు. టీ ప్రైడ్ కింద సబ్సిడీ రుణాలు మంజూరుకు ఎస్సీలు 36, ఎస్టీలు 17, ఇద్దరు దివ్యాంగులు ఎంపిక కాగా వారికి ఈ నెల 17వతేదీన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా అర్హత పత్రాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పీఎం విశ్వకర్మ స్కీంపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఇండస్ట్రీస్ ఏడీ భారతి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ రావు, సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ జిల్లా అధికారి అమరేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, డీటీడీవో జనార్దన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎనీమియా నిర్ధారణ పరీక్షలకు ఏర్పాట్లు

- రేపటి నుంచి ప్రారంభం

సిరిసిల్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఎనీమియా నిర్ధారణ పరీక్షలకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ, డీఆర్‌డీవో, పంచాయతీరాజ్, విద్యాశాఖ సంయుక్తంగా గర్భిణులు, బాలింతలు, బాలికలు, పిల్లలకు ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఎనీమియా లోపంతో జిల్లాలో ఎవరూ ఉండకూడదనే ఉద్దేశం మేరకు షెడ్యూల్ ఖరారు చేశారు. జిల్లాలో 54,276 మందికి పరీక్షలు చేయనున్నారు. సిరిసిల్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో 34,267 మంది, వేములవాడ ప్రాజెక్ట్ పరిధిలో 20,009 మందికి పరీక్షలు చేయనున్నారు. గర్భిణీలు, బాలింతలతో పాటు ఆరేళ్ల లోపు పిల్లలు, 10 నుంచి 19 సంవత్సరాల లోపు బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏఎన్ఎం, ఆశాలు నిర్ధారణ పరీక్షలు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని, శిబిరాల సమాచారాన్ని విద్యాశాఖ సీఆర్పీలు లబ్ధిదారులకు చేరవేయాలని సూచించారు. జిల్లాలో 14, 15, 18, 19, 20 తేదీల్లో అన్ని మండలాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 12: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో లెక్కించారు. ఆలయ 30 రోజుల హుండీ ఆదాయం కోటి 82 లక్షల 33 వేల 710 రూపాయలు, 150 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 14 కిలోల 700 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ఏర్పాట్లు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12: సిరిసిల్ల పట్టణం మానేరు తీరాన వినాయక విగ్రహాల నిమర్జనంలో ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం మానేరు తీరంలో వినాయక నిమర్జనం ఏర్పాట్లను డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణతో కలసి మున్సిపల్ చైర్ పర్సన్ కళాచక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ నవరాత్రులు వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించుకో వడం ఆనవాయితి అన్నారు. ఈ నెల 17న వినాయక విగ్రహాల నిమర్జనం కోసం నిర్వహిస్తున్న పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో లైటింగ్, భారికేట్లు, పారిశుధ్య పనులు, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వినాయక నిమర్జనం ఏర్పాట్లకు మున్సిపల్ నుండి నిధులు రూ. 15 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతవరణంలో వినాయక నిమజ్జనం వేడుకలను నిర్వహించుకోవడం కోసం ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, డీఈ ప్రసాద్, ఏఈ నరసింహస్వామి, కౌన్సిలర్ దార్నం అరుణాలక్ష్మినారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరి గుట్ట ప్రాంతాన్ని కాపాడండి

కోనరావుపేట, సెప్టెంబరు 12: మండలంలోని శివంగాలపల్లి గ్రామ శివారులోని కుమ్మరి గుట్ట ప్రాంతాన్ని కాపాడాలని మాజీ సర్పంచ్ సురేష్ యాదవ్‌తో పాటు గ్రామస్థులు గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ శివంగాలపల్లి అటవీ ప్రాంతంలోని సర్వే నంబర్ 17 కుమ్మరి గుట్ట ప్రాంతాన్ని కొంతమంది వాహనాల ద్వారా సాగు చేస్తున్నారని ఆరోపించారు. వారిపై గతంలో కూడా అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. గతంలో నూలి బాలకృష్ణారావు అనే వ్యక్తి శివంగాలపల్లి పట్వారిగా ఉన్న సమయంలో గ్రామంలో కుమ్మరి గుట్ట ప్రాంతాన్ని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి ఇప్పుడు ధరణిలో పాసుబుక్ పొందారని అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసి రైతుబంధును కూడా ఆపామని అన్నారు. అలాగే గ్రామా నికి చెందిన ఆ భూమిని అతని నుంచి కాపాడి గ్రామానికి చెందేలా చూడాలని కోరారు.

పేరుకుపోయిన చెత్త తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12: మండలంలోని రాచర్ల బొప్పాపూర్ ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింది. చెత్తాచెదారంతో కంపు భరించ లేక కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'చెత్త కంపు.. ఏదీ పట్టింపు..?' అనే కథనానికి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి గణేశ్ గురువారం స్పందించారు. పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు మురుగు నీటి కాల్వలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. రహదారి పక్కన చెత్త పడేస్తున్న కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటర్ విద్యార్థి ఆచూకీ లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 12: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన చాట్ల సుశాంక్ అనే ఇంటర్ విద్యార్థి గురువారం ఆచూకీ లభ్యమైంది. సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సుశాంక్ ఈనెల 10న రాత్రి 11గంటల తర్వాత ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఈ మేరకు తల్లి రచన తన కుమారుడు అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి 24గంటల్లో సీసీ కెమెరాల సహాయంతో ఇంటర్ విద్యార్థి సుశాంక్ ఆచూకీ తెలుసుకొని టౌన్ సీఐ కె కృష్ణ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం చేసుకోవాలి

- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ

వేములవాడ రూరల్, సెప్టెంబరు 12: శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం చేసుకోవాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ గుడి చెరువులో ఈ నెల 16వతేదీన వినాయక నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పోలీస్ అధికారుల సూచనలను గణేష్ మండపాల నిర్వాహకులు, యువత, ప్రజాప్రతినిధులు పాటించి సహకరించాలన్నారు. పోలీసు శాఖ నిబంధనల మేరకు రెండు సౌండ్ బాక్సులు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బందిని నియమించి లైఫ్ జాకెట్లు సమకూర్చాలని, ఎక్సైజ్, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండి తమ సేవలను అందించాలన్నారు. నిమజ్జనానికి కావాల్సిన క్రేన్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయం కల్పించాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేష్, ఏఎస్పీ శేశాద్రినీరెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్ మహేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

ఎల్లారెడ్డిపేట: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, వేడుకలకు పటిష్ట చర్యలు చేపట్టనున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం రాత్రి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పాటు రాచర్ల గొల్లపల్లి రాచర్ల బొప్పాపూర్ గ్రామాల్లో వినాయక మండపాల జియో ట్యాగింగ్ ప్రక్రియను పరిశీలించారు. మండపాల వద్ద తీసుకుంటున్న భద్రతా చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించాలన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆయన వెంట డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్



సమీక్ష చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 12: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. గురువారం సిరిసిల్ల కోర్టు ఆవరణలోని లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌తో పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ ఏయిడ్ పరిధిలో కేసులను వేగవంతం చేయాలన్నారు. వెంటవెంటనే పెండింగ్ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఇప్పటివరకు ఎన్నికేసులు వచ్చాయని, ఇందులో పరిష్కారమైన వాటి వివరాలను, ఇంకా ఎన్ని పెండింగ్ కేసులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటిని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ టి పరుశరాములు, డిప్యూటీ చీఫ్ ఎస్ మల్లేశ్‌యాదవ్, లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జిందం వర్షిత్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12: జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి జిందం వర్షిత్ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని రైసింగ్ అకాడమీ, ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిందం వర్షత్‌ను అభినందించారు. సిరిసిల్ల పట్టణం ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న జిందం వర్షిత్ చిన్ననాటి నుంచి ఆటలపై మక్కువ పెంచుకున్నాడు. రైసింగ్ ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ హ్యాడ్‌బాల్ కోచ్ కృష్ణహరి ప్రత్యేక శిక్షణలో హ్యాండ్ బాల్ క్రీడలో వర్షిత్ నైపుణ్యం సాధించాడు. వర్షిత్ రామడుగులో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వర్షిత్ పాల్గొన్నాడు. పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14, 15వ తేదీల్లో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో వర్షిత్ పాల్గొంటాడని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 12: సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీతోపాటు భారతదేశ కార్మికవర్గానికి తీరనిలోటని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువా రం సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యం లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మరణించారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోట అని అన్నారు. విద్యార్థి దశనుంచే ఎస్ఎఫ్ఐలో చేరి వామపక్ష భావాజాలకు అకర్షితుడై భారతదేశంలో సమసమాజ నిర్మాణం కోసం తన జీవితాంతం పోరాడిన మహనీయుడన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఆయన వారసులుగా నిరంతం రాబోయే కాలంలో పోరాటాలు నిర్వహి స్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, సూరం పద్మ, విమల, శ్రీరాం సదానందం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాదిగ సంక్షేమ సంఘం కార్యవర్గం

సిరిసిల్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదిగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం సిరిసిల్ల లోని మాదిగ సంక్షేమ సంఘ భవనంలో సర్వసభ్య సమావేశంలో సిరిసిల్ల అధ్యక్షుడిగా గడ్డం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా అకునూరి సుధీర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గడ్డం ప్రశాంత్, నగునూరి శివ, అకునూరి అజయ్, వడ్లూరి ప్రశాంత్, గడ్డం నాగరాజు, సహాయ కార్యదర్శులుగా నక్క నవీన్, అకునూరి అభిషేక్, కలికోట దేవీ ప్రసాద్, నేదూరి చంద్రశేఖర్, కోశాధికారిగా ఆకునూరి శంకరయ్య, గౌరవ అధ్యక్షులుగా ఆకునూరి బాలయ్యను, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

ఏఎస్పీని కలిసిన సెస్ డైరెక్టర్

రుద్రంగి, సెప్టెంబరు 12: వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిని గురువారం వేములవాడలోని ఏఎస్పీ కార్యాలయంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. పలువురు నాయకులు ఉన్నారు.

'రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి'

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 12: హిందీ భాషతో పోల్చుకుంటే తెలుగు భాష అంత ముఖ్యం కాదంటూ తెలుగు భాషను అవమానించిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలుగు ప్రజలకు బహిరంగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తెలుగు భాషపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టి రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు బీజేపీ నాయకులను అడ్డుకుని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు పండుగ మాధవి, ప్రధాన కార్యదర్శులు గాజుల సదానందం, నరేష్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, నాయకులు ఉరగోండ రాజు, పంపరి అర్జున్, రచ్చ రాహుల్, కౌరంపల్లి రమేష్, తాటిపాముల సత్యం పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం మాట్లాడుతూ తెలుగు భాషను అవమానపరిచిన రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు జింక వెంకటి, మోత్కు మోహన్, బెంద్రే శ్రీని వాస్ రెడ్డి, శ్రీనివాస్, నరసయ్య, లచ్చి రెడ్డి, మల్లేశం, తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని రైతు మృతి

- మరొకరికి గాయాలు



చిన్నలింబన్న(ఫైల్)

మల్లాపూర్, సెప్టెంబరు 12: మండలంలోని మొగిలిపేట గ్రామ శివారు లో లారీ ఢీకొట్టడంతో రాణవేని చిన్నలింబన(60) అను రైతు గురువారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందని రాణవేని చిన్నలింబ న్నతో పాటు గ్రామానికి చెందిన మల్యాల గంగులు మొగిలిపేట గ్రామ శివారులోని ఉన్న మొక్కజొన్న తోటకు వెళ్లారు. చేనులో పనులు ముగించుకుని చిన్నలింబన్న ద్విచక్ర వాహనంపై ఇద్దరు ఓబులాపూర్‌కు బయల్దేరారు. ఖానాపూర్ నుంచి మెట్‌పల్లికి వెళ్తున్న లారీని డ్రైవర్ సయ్యద్ ముస్తాక్ అజాగ్రత్తగా మొగిలిపేట శివారులో చిన్నలింబన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో చిన్నలింబన్న తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన గంగును చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించారు. మృతుడి భార్య రాజగంగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

వీణవంక, సెప్టెంబరు 12: మండలంలోని రామక్క షాపూర్ గ్రామానికి చెందిన బొబ్బల మోహన్‌రెడ్డి (82) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరా ల ప్రకారం.. మోహన్‌రెడ్డి భార్య ప్రమీల తొమ్మిది నెలల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహ త్య చేసుకున్నాడు. మృతుడి కూమారుడు బొబ్బల అశోక్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబరు 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 117క్వింటాళ్లు విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఖరారయ్యేనా..?

- నేడు మూడో సారి తలనీలాల టెండర్లు
- దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాట్లు

మల్యాల, సెప్టెంబరు 12: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో తలానీలా పోగు చేసుకునేందుకు గాను అధికారులు మరో సారి తలానీ లాల టెండర్లు శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను హైదరాబా ద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహిం చగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు మూడో సారి శుక్రవారం నిర్వహించను న్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే ఏడాది జూలై నెలాఖరు కాలపరిమితికి గాను మొదటి సారి టెండర్ ఫిబ్రవరి 7న నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1,116 హెచ్చు పాట రాగ ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించనున్నారు.

కాగా కొండగట్టులో నిర్వహించిన తలానీలాల టెండర్లు ప్రతీ సారీ కొలిక్కి రాకపోవడంతో అధికారులు కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. కాగా మూడో సారి అయిన ఖరారు అయ్యోనా అని ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం నిర్వహించే టెండరులో పాల్గొనడానికి 10 షెడ్యూల్స్ వచ్చినట్లు తెలిసింది

నరసింహుడి సన్నిధిలో సినీ నటుడు రాజీవ్ కనకాల



రాజీవ్ కనకాలకు స్వామి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఈవో

దర్మపురి, ఆగస్టు 12: దర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని సి నీ నటుడు రాజీవ్ కనకాల గురువారం ఉదయం సందర్శించారు. వేద పం డితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆ యన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపం డితుల మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, చిత్రపటం బహూకరించి సత్కరిం చారు. అనుబంధ ఆలయాలను కూడ సందర్శించారు. ఆయన వెంట ఆల య సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, నంబి నరసింహమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అంజన్నను దర్శించుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే

మల్యాల, సెప్టెంబరు 12: కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పర్య వేక్షకులు హరిహర నాథ్ శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.

● సినీనటుడి పూజలు

సినీ నటుడు రాజీవ్ కనకాల ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. స్వామి వారి విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. పర్యవేక్షకులు హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆయన వెంట ఉన్నారు. రాజీవ్ కనకాలతో పలువురు సెల్ఫీలు దిగారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నిరసన

గణేశ్‌నగర్, సెప్టెంబరు12: రాష్ట్ర విద్యుత్తు ఎస్సీ మరియు ఎస్టీ ఉద్యోగుల ఐకాస పిలుపు మేరకు జిల్లా విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనందం, డివిజనల్ ఇంజనీర్ వరంగల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఆనంద్, బండారి చంద్రయ్య మరియు ప్రాంతీయ కార్యదర్శి శ్రీ పీ కిరణ్ కుమార్ కరీంనగర్, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం శ్రీ సుల్తాన్ రవి, ఏఏఓ రాందాస్, గణేష్ జేఏఓ కరీంనగర్ టౌన్ మరియు రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆరేపల్లి శామయ్య, మల్లేపల్లి అంజయ్య , జాడి తిరుపతి, రత్నం పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్

భగత్‌నగర్, సెప్టెంబరు 12: కొత్తపల్లి మండలంలోని చింతకుంట, కొత్తపల్లి పట్టణంలో నిర్వహించే నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్‌లు అన్నారు. గురువారం చింతకుంటలోని ఎస్సారెస్పీ కాలువ, కొత్తపల్లి చెరువులను పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనానికి ఆటంకం లేకుండా చెరువులో తుంగను తీయించాలన్నారు. చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బందులకు లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేయడానికి భూమిని చదువును చేయాలన్నారు. చెరువు పరిసరాల్లో డస్ట్ చల్లించడం, లైటింగ్ ఏర్పాట్లు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ రమేష్, ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం, ఆర్అండ్‌బీ, కార్పొరేషన్, రెవెన్యూ, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు


నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురివికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!

» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్చేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరపు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా..సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

లోలెవల్ బ్రిడ్జిని కూల్చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 12: గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగు లోలెవల్ బ్రిడ్జిని కూల్చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో గురువారం విలేకరుల సమావేశంలో చంద్రం మాట్లాడారు. మానేరు వాగుపై మంజూరైన కొత్త బ్రిడ్జిని నిర్మించకుండా పాత బ్రిడ్జిని సదరు కాంట్రాక్టర్ కూల్చి వేయడం ఏంటని ప్రశ్నించారు. వాగుపై వేసిన తాత్కలిక మట్టి రోడ్డు కొట్టుకపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కాంట్రాక్టర్‌తో పాటు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్లడ్ బ్యాంక్ కేంద్రం కోసం స్థలం కేటాయించాలి

- కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ ప్రతినిధుల వినతి

సిరిసిల్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ బ్యాంక్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ప్రతినిధులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి గురువారం జిల్లా సన్మానించి వినతిపత్రం అందించారు. కలెక్టర్ స్థలం కేటాయింపుపై స్పందిస్తూ వేములవాడ ప్రాంతంలో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. వేములవాడకు బ్లడ్ బ్యాంక్ ఎంతో అవసరం ఉందని తప్పనిసరిగా స్థలం కేటాయించడంపై సహకారం అందిస్తానని తెలిపారు. వేములవాడ పట్టణానికి చేరువలోనే బ్లడ్ బ్యాంక్‌కు స్థలం కేటాయించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్‌కు రెడ్‌క్రాస్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్‌చైర్మన్ పి వేణు, కోశాధికారి శివప్రసాద్, కార్యదర్శి టి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు సంగీతం శ్రీనివాస్, సభ్యులు గుడ్డ సునీల్, భాస్కర్, సంజీవరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

రుద్రంగి, సెప్టెంబరు 12: రుద్రంగి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని చందుర్తి, రుద్రంగి ఉద్యోగ ఉపాధ్యాయులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రుద్రంగిలో కొత్త పింఛన్ విదానాన్ని రద్దు చేయాలని ఉద్యోగులు సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వంగ తిరుపతి, కటుకూరి ముఖేష్, శ్రీనివాస్, నరేష్, రవి, అమృత్ లాల్, జలందర్ రెడ్డి, బాలకిషన్, రమేష్, మీనాక్షి, శ్యామల, మాదవి పాల్గొన్నారు.

గిరిజన సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలి

కోనరావుపేట, సెప్టెంబరు 12: తెలంగాణ రాష్ట్రంలో గిరిజన లంబాడి సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా లంబాడి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోతు నరేష్ నాయక్ అన్నారు. కోనరావుపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తుందని అన్నారు. ఇంతవరకు లంబాడి సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రివర్గంలో స్థానం ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి గిరిజన లంబాడి వర్గానికి మంత్రి పదవిలో స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో సాగర్ నాయక్, తిరుపతి నాయక్, రమేష్ నాయక్, రాందాస్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ పట్టణ, మండల కార్యవర్గం ఎన్నిక

వేములవాడ, సెప్టెంబరు 12: వేములవాడ, వేములవాడ రూరల్ మండలాలకు చెందిన పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు సత్యనారాయణ, పులి రాజుగౌడ్ తెలిపారు. వేములవాడ అర్బన్ శాఖ అధ్యక్షుడిగా లావు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా, శ్రీపతి రాంప్రభు, అసోసియేట్ అధ్యక్షుడిగా వనమాల రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా యామ మాధవి, కార్యదర్శిగా గుజ్జుల నవీన్ ఎన్నికయ్యారని తెలిపారు. వేములవాడ రూరల్ అధ్యక్షుడిగా కోటోజు రమేశ్, ప్రధాన కార్యదర్శిగా గడప మధుకర్, అసోసియేట్ అధ్యక్షుడిగా లింగంపల్లి రాజు, ఉపాధ్యక్షురాలిగా కొల్లూరి వసంత, కార్యదర్శిగా ఉప్పుల మహేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు గురువారం నాడు వేములవాడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని శ్రీనివాస్ రావు, ఎడ్ల కిషన్, రాష్ట్ర బాధ్యులు మాన్వాడ శంకర్, కిరణ్, పులి రాజా గౌడ్, సూర్యనారాయణ, శ్రీకాంతరావుతో పాటు జిల్లా బాధ్యులు మాడిశెట్టి మహేశ్, ఆడేపు గోవర్ధన్, మల్లారెడ్డి, రుద్రవీణ, కాపిల్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడిగా పుప్పాల శ్రీనివాసచారిని, ప్రధాన కార్యదర్శిగా కొడకంటి తిరుపతిని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ గురువారం తెలిపారు. పీఆర్టీయు మండల అసోసియేట్ అధ్యక్షుడిగా కైరి లింగయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి సప్న, కార్యదర్శిగా రాకం రవిలను, రుద్రంగి మండల పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడిగా పెరుమండ్ల హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శిగా కాట్నపల్లి రమణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా జంగం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వడ్డేపల్లి శ్యామల, కార్యదర్శిగా పిట్టల పూర్ణిమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన సర్వే



మూలవాగులోని బతుకమ్మ తెప్ప వద్ద సర్వే చేస్తున్న అధికారులు

వేములవాడ, సెప్టెంబరు 12: వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారి మూలవాగు వెంట వరుసగా రెండో రోజు గురువారం అధికారులు సర్వే కొనసాగించారు. డివిజనల్ సర్వే అధికారి బాలచంద్రం ఆధ్వర్యంలో పలువురు అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ మండల పరిధిలోని మల్లారం నుంచి మహాలక్ష్మి వీధి వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న మూలవాగుకు రెండు వైపులా హద్దులు ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మూలవాగు సరిహద్దు సమీపంలో మొత్తం 60 సర్వే నంబర్లు ఉన్నాయన్నారు. వీటిలో ఇప్పటి వరకు 10 సర్వేనెంబర్లలో సర్వే పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. సర్వే ప్రక్రియ పూర్తి అయిన తర్వాత నివేదికను జిల్లా కలెక్టర్ అందజేస్తామని వివరించారు. మొదటి బైపాస్ రహదారిలో ఏడాది కింద సర్వే చేసి బఫర్ జోన్ నిర్ణయించి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు ఇందులో కొన్ని ఇళ్లు బఫర్ జోన్ దాటి నిర్మాణాలు జరిగాయని పేర్కొంటూ యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు కొన్నింటిని కూల్చివేశారు. కాగా మొదటి బైపాస్ రహదారిలో కూడా కొలతలు వేస్తామని అధికారులు స్పష్టం చేయడంతో మూలవాగు పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారు ఆందోళన చెందుతున్నారు.

డైయింగ్ కార్మికులకు కూలి రేట్ల పెంపు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 12: సిరిసిల్లలో డైయింగ్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కూలి రేట్లను పెంచుతూ పరిశ్రమల యాజమానులు అంగీకరించి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో గురువారం డైయింగ్‌పరిశ్రమ యాజమానులతో రాజన్న సిరిసిల్ల జిల్లా డైయింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులతో జరిగిన చర్చలల్లో డైయింగ్ పరిశ్రమలల్లో పనిచేసే కార్మికులకు కూలి పెంచాలని కార్మిక సంఘాలనాయకులు కోరారు. దీంతో పరిశ్రమల యాజమానులు ప్రస్తుతం ఉన్న కూలిపై ఒక లాటుకు రూ 15 పెంచిఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించారు. మిగిత బెనిఫిట్స్ అన్ని చట్టప్రకారం అమలు చేయుటకు ఒప్పుకున్నట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. నూతన కూలీ ఒప్పందం 19-09- 2024 నుంచి 10-09- 2026 వరకు అమలులో ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా డైయింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. చర్చలల్లో సిరిసిల్ల క్లాత్ డైయింగ్ ప్రొడ్యూసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తాటిపాముల దామోదర్, అడెపు రవీందర్, కోడం శ్రీనివాస్, చిలుక రాజేశం, సిరిసిల్ల డైయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జగ్గాని మల్లేశం, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల కనుకయ్య, కార్యనిర్వహక అధ్యక్షుడు కొక్కుల భూమయ్య, గౌరవ అధ్యక్షుడు మాదాసు బలరాం తదితరులు పాల్గొన్నారు.

వేకువజామున.. రెండు కిలోమీటర్లు నడిచి..

విద్యార్థినుల రాస్తారోకో



సిరిసిల్ల -సిద్దిపేట రహదారిపై బైఠాయించిన విద్యార్థినులు

- పీఈటీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సుమారు ఐదు గంటల పాటు ఆందోళన
- గెస్ట్ పీఈటీని తొలగించిన డీఈవో
- పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్

అది సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారి.. ఉదయం ఐదు గంటలు.. రోడ్డుపై పదుల సంఖ్యలో విద్యార్థినులు.. ఒక్కొక్కరిగా వచ్చి బైఠాయించి నినాదాలు చేయడం ప్రారంభించారు. తమను ఇబ్బంది పెడుతున్న పీఈటీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెల్లవారు జామున స్కూల్ యూనిఫాంలో వచ్చి బైఠాయించిన విద్యార్థులను చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. వారి వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తాము బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులమని వారు చెప్పారు. రెండు కిలో మీటర్ల దూరం నుంచి నడిచివచ్చామని తెలిపారు. స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన అధికారులు విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్‌కు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆరోపణలు వచ్చిన పీఈటీని విధుల నుంచి తొలగించారు.

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12: గెస్ట్ పీఈటీ తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు రోడ్డుపై గురువారం ఉదయం బైఠాయించారు. తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు గురువారం తెల్లవారు జామున ఐదు గంటలకు సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. పాఠశాలలోని గెస్ట్ పీఈటీ జ్యోత్స్న కొద్దిరోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విద్యార్థినులు వాపోయారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పాఠశాలలో జరిగిన ప్రత్యేక తరగతులకు కొంత మంది విద్యార్థినులు వివిధ అనారోగ్య కారణాలతో హాజరు కాలేదు. దీంతో ఆగ్రహించిన గెస్ట్ పీఈటీ జ్వరం వచ్చింది రాలేమని చెప్పిన నలుగురు విద్యార్థులను, ఇతర కారణాలతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థినులను చితకబాదిందని తెలిపారు. ఆరోగ్యం సహకరించడం లేదని టీచర్‌ను వేడుకున్నా వినలేదన్నారు. తోటి విద్యార్థినులు గురువారం తెల్లవారు జామున ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో గోడ దూకి బయటకు వచ్చారు. పాఠశాల నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. చీకట్లో సుమారు రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన చేరుకోని ఆందోళనకు దిగారు. పీఈటీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ పీఈటీ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. అనారోగ్యంగా ఉన్నామని క్లాస్‌లకు హాజరు కాలేమంటే తీవ్రంగా కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాత్‌రూంలో స్నానం చేస్తుంటే తలుపులు విరగొట్టి లోనికి దూరి ఫోన్‌లో తమను అసభ్యకరమైన వీడియోలు రికార్డు చేశారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని టీచర్‌పై ఫిర్యాదు చేయాలని, ఆందోళన విరమించాలని సూచించారు. ఆందోళన విరమించేది లేదని న్యాయం కోసం కలెక్టర్ ఇంటికి వెళ్లడానికి ప్రయత్నిం చారు. ఎస్ఐ సుధాకర్ విద్యార్థినులకు నచ్చజెప్పడంతో పాఠశాలకు వెళ్లారు.

● పాఠశాల ఎదుట ధర్నాకు దిగిన విద్యార్థినులు

పీఈటీని సస్పెండ్ చేయాలని, ఫోన్‌లో ఉన్న వీడియోలు డిలిట్ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థినులు బైఠాయించారు. తమ ముందే ఫోన్‌లో వీడియోలు డిలిట్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రఘుపతి అక్కడికి చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పి గెస్ట్ పీఈటీ జ్యోత్స్నను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఫోన్‌ను తెప్పించి వీడియోలు డిలిట్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సుమారు ఐదు గంటలపాటు విద్యార్థినులు ఆందోళన చేశారు.

● విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థినులకు మద్దతుగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు గిరిజన సంక్షేమ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగాయి. గెస్ట్ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురుకులాలు సక్రమంగా నడవడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గెస్ట్ పీఈటీని విధుల్లోనుంచి తొలగించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ సిబ్బంది మోహరించారు. విద్యార్థి సంఘాల నాయకులకు నచ్చచెప్పి ఆందోళన విరమింప జేశారు.

● పీఈటీని తొలగించాం..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సందర్శించారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లడారు. విద్యార్థినుల సమస్యలు, గెస్ట్ పీఈటీ పెట్టిన ఇబ్బందులపై ఆరా తీశారు. పీఈటీని తొలగించినట్లు తెలిపారు. విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పాఠశాల ప్రత్యేకాధికారి డీసీవో రామకృష్ణ, ప్రిన్సిపాల్ శకుంతలను ఆదేశించారు. ఆయన వెంట డీఈవో రమేశ్ ఉన్నారు. పాఠశాలను సందర్శించడానికి వచ్చిన కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.



గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్

యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి: ఎస్పీ

వేములవాడ రూరల్, సెప్టెంబరు 12: విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేసి మొదటి దశలోనే ర్యాగింగ్‌ను కట్టడి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. అగ్రహారం జేఎన్టీయూ, పాలిటెక్నిక్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌లపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని మాట్లాడారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను గమనించాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. తోటి వారితో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురిచేయడంలాంటివి విద్యార్థుల లక్ష్యం కాదన్నారు. విద్యార్థులు సీనియర్, జూనియర్ అనే తారతమ్యంలేకుండా స్నేహపూర్వక వాతావరణంలో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెడతాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినులు, మహిళలు మౌనం వీడాలని ముందుకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. మహిళలు నిర్భయంగా ముందుకువచ్చి తమ సమస్యలను తెలపాలన్నారు. మహిళలకు ఏదైనా సమస్య ఉంటే షీటీమ్ నంబర్ 8712656425కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, ఎస్సైలు రమేష్, అంజయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శంకర్, జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చారి, షీటీమ్, భరోసా సెంటర్ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలి

సిరిసిల్ల రూరల్: విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి విద్యార్థులను ఉన్నత స్థాయి ఎదిగేందుకు కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నారాయణ పాఠశాలలో గురువారం ఇన్వెస్టి ట్యూచర్ వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎస్పీ పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, ఇతర క్లబ్ మెంబర్లకు బ్యాడ్జెస్, సాషెస్‌ను అందించారు. కార్యక్రమంలో కరీంనగర్‌జోన్ ఏజీఎం అన్నం చైత న్యరావు, జీఎం గోపాల్‌రెడ్డి, ఆర్ఎస్ లకపతి, ఆర్ఐ సత్యంరావు, ప్రిన్సిపాల్ జీమోల్, కోఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం.. తప్పిన ప్రాణాపాయం



గూడ్స్ ఆటోపై పడిపోయిన విద్యుత్ స్తంభం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12: పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగి అటువైపుగా వచ్చిన గూడ్స్ ఆటోపై గురువారం పడింది. ఒక్కసారి విద్యుత్ తీగలు తెగిపోయి వాటి నుంచి మెరుపుల వచ్చి విద్యుత్ నిలిచిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. విద్యుత్ స్తంభం పడిపోవడం తీగల తెగిపోవడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు వెంటనే సెస్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్‌ను నిలిపివేయడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంబేద్కర్‌నగర్‌లో శిథిలావస్థలో విద్యుత్ స్థంభాలు చాలా ఉన్నాయని ప్రమాదాలు జరగక ముందే సెస్ అధికారులు స్పందించి విద్యుత్ స్థంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

'మిడ్ మానేరు'కు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి/ఇల్లంతకుంట సెప్టెంబరు 12: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్ఆర్ఎస్‌పీ వరద కాలువ ద్వారా 15250 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతుండగా, ఇందులో అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6550 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316. 75 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 24.49 టీఎంసీలకు చేరుకుంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీలకు గానూ 2.65 టీఎంసీలకు చేరుకున్నాయి.

సెప్టెంబరు 17ను విలీన దినోత్సవంగా ప్రకటించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12: సెప్టెంబరు 17వ తేదిని హైదరాబాద్ రాష్ట విలీన దినోత్సవంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ శివారులోని సింగిరెడ్డి భూపతిరెడ్డి స్థూపం వద్ద సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వారిని స్మరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పంతం రవి, కడారి రాములు, మంద సుదర్శన్, అజ్జ వేణు, సోమ నాగరాజు, బాలయ్య, మంత్రి చంద్రన్న, బద్దం సంజీవరెడ్డి, బాల నర్సు, బాలమల్లు, ఆనంద్, బాలకుమార్, బాల చంద్రం, రాజిరెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 12: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీవర్షాలతో నష్టం జరిగిందని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వం వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలంటూ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురిసి తీవ్రమైన నష్టం జరిగిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక చెరువుల, కుంటలు నిండి కొన్నిచోట్ల గండ్లు పడ్డాయని ప్రధాన రహదారితో పాటు మట్టిరోడ్లు కొట్టుకుపోవడంతో గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో ఇళ్లలోకి బురద చేరి ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ 6 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. నాయకులు పంతం రవి, కడారి రాములు, మంద సుదర్శన్, అజ్జ వేణు, సోమ నాగరాజు పాల్గొన్నారు.

మహిళలను అవమానించడం సరికాదు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12: హుజూరాబాద్ నియోజకవర్గ మహిళలు ఓట్లు వేస్తే ఎమ్మెల్యేగా గెలిచి ఆ మహిళలనే అవమానించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మహిళ లోకాన్ని కించపరుస్తు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ పక్షాన ఖండిస్తున్నామని తెలిపారు. హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటిచేసిన కౌశిక్‌రెడ్డి ఓటర్లను బెదిరింపులకు గురిచేశాడని ఆరోపించారు. ఎన్నికల్లో తనకు ఓటు వేయకుం టే కుటుంబం అంతా ఆత్మహత్య చేసుకుంటా మని ఓటర్లను బెదిరిస్తే జాలి పడి మహిళలు ఓట్లు వేశారని పేర్కొన్నారు. మహిళలు ఓట్లు వేస్తే గెలిచిన కౌశిక్‌రెడ్డి మహిళలనే కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో సారి పునరావృతం అయితే మర్యాద ఉండదని తెలిపారు.

ఉత్సాహంగా మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

ముస్తాబాద్, సెప్టెంబరు 12: మండలంలోని పోతుగల్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు రెండవరోజు కొనసాగాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న అండర్-17 విభాగ క్రీడల్లో గురవారం మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు, బాలురు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు కాంగ్రెస్ యువజన నాయకుడు గుండం అభిలాష్ బహుమతులను సమకూర్చారు. కార్యక్రమంలో ఎస్సై గణేశ్, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, శీల ప్రశాంత్, తాళ్ల విజయ్‌రెడ్డి,నవీన్, ఉచ్చిడి బాల్‌రెడ్డి, ఎదూనూరి భాను, మండల నోడల్ అధికారి రాజిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాధకిషన్ , పీఈటీలు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతును అందిస్తున్న ఎస్సై గణేశ్ తదితరులు

ఇల్లంతకుంట: క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందని ఎంఈవో బన్నాజీ పేర్కొన్నారు. మండలంలోని గాలిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ఆటలను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై దృష్టి నిలుపాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయిలో ఆడటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు వేముల అశోక్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ సంపత్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సాన బాబు, సాబీర్, రాజు, రాధారాణి, మామిడి శ్రీనివాస్, తిరుపతి, వివిధ గ్రామాల క్రీడాకారిణీలు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలను బీజేపీలో చేర్పించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 12: అన్నివర్గాల ప్రజలను బీజేపీలో చేర్పించాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివెద మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సభ్యత్వనమోదు కార్యక్రమం ప్రారంభం అయ్యింది. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి రాష్ట్రంలో ప్రజల ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యకర్తలు పార్టీని గ్రామగ్రామాన విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మ్యాకల మల్లేశం, అమ్ముల అశోక్‌యాదవ్, ముత్తక్క, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సాయగౌడ్, శ్రీకాంత్, కృష్ణ, శ్రీనివాస్, స్వామి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బస్సులను పునరుద్ధరించాలి

గంభీరావుపేట, సెప్టెంబర్ 12: సిద్దిపేట డిపో నుంచి బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ కలిసి వినతి పత్రం అందజేశారు. వారం రోజుల కిందట బారీ వర్షాల కారణంగా గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై ఉన్న తాత్కలిక మట్టి రోడ్డు కొట్టుక పోయిందని, ఫలితంగా ఈ మార్గం వెంట సిద్దిపేట బస్‌లు రద్దు చేశారని మంత్రికి వివరించారు. బస్‌ల రద్దుతో ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్‌లను పునరుద్దరించాలని హమీద్ మంత్రిని కోరారు. దీంతో వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ సంభందిత అధికారులతో మాట్లాడటంతో తిరిగి సిద్దిపేట బస్సులను పునరుద్ధరించారు.

పీఎఫ్, బీమా పత్రాల అందజేత

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 12: పట్టణం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవల మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు పీఎఫ్, ఇన్సూరెన్స్, పెన్షన్ డబ్బులు మంజూరు కాగా చైర్‌పర్సన్ మంజూరు పత్రాలను అందించారు. మేర్గు రామస్వామి కుటుంబానికి రూ. 5,80,908, తుమ్మ బాలరాజు కుటుంబానికి రూ. 4,60,966, సిరిగిరి సురేష్ కుటుంబానికి రూ. 4 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ మిర్జా ఫసహత్ అలీ బేగ్, కౌన్సిలర్లుపాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

చందుర్తి: మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయ సమీపంలో ఓ వ్యవసాయ బావిలో నెమలి పడడంతో రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బావి వద్దకు అటవీశాఖ అధికారులు చేరుకొని నెమలిని బయటకు తీసి చికిత్స చేసిన అనంతరం అటవీ ప్రాంతం లో వదిలిపెట్టారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రాజశేఖర్, సిబ్బంది సలీం, శంకర్ పాల్గొన్నారు.

- చందుర్తి మండల కేంద్రంలో ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- రైతులకు రుణాలు ఇవ్వడంలో సింగిల్ విండో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సింగిల్‌విండో వైస్‌చైర్మన్ పుల్కం మోహన్, డైరెక్టర్ పుల్కం లచ్చయ్య ఆరో పించారు. సింగిల్ విండోలో 15రోజుల నుంచి రుణాల కోసం తిరిగినా రుణాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు.

- చందుర్తి మండల కేంద్రంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. దీంతో చందుర్తిలో స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, గ్రామ యువకులు కలిసి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సత్కరించారు.

వేములవాడ రూరల్: జాతీయ బీసీ యువజన సంఘం కార్యదర్శిగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి అనుసంధానమైన గొల్లపల్లి గ్రామానికి చెందిన అమరగొండ అజయ్ నియమితుడయ్యాడు. ఈ మేరకు సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

- మండలంలోని చెక్కపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి ప్రారంభించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

- వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం పక్కన అంబేద్కర్ జంక్షన్ అభివృద్ధి చేస్తున్న క్రమంలో అంబేద్కర్ విగ్రహాన్ని వేరేచోటికి తరలిస్తారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. జంక్షన్ అభివృద్ధితో పాటు సుందరీకరణ చేస్తూ అంబేద్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచుతామని స్పష్టం చేశారు.